కథ

# మెహర్

నెల్లుట్ల రమాదేవి
94406 22781

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

ఆకాశం పచ్చికుండలా.. ఏ క్షణాన్నయినా వానవచ్చేలా ఉంది. ఉదయం పదిగంటలైంది. అప్పటికే అందరూ వచ్చి, ఊరి మధ్యలోని గంగరావి చెట్టుకింద కూర్చున్నారు. ఇంకా పెద్దమనుషులు రాలేదు.

ఓ పక్కన చదునైన బండరాయి మీదకూర్చుని ఉంది రసూల్‌బీ. మనిషి కాస్త మొరటుగా, బలిష్ఠంగా ఉంది. చూపులు చురుగ్గా, ధీమాగా ఉన్నాయి.

ఆమెకు కాస్త పక్కగా సిమెంట్‌బెంచీ మీద నయీమ్ కూర్చున్నాడు. యవ్వనం పూర్తవుతున్న దశలో.. కాస్త అమాయకంగా, కొంచెం మర్యాదగా ఉన్నాడు.

అతనికి కాస్త ఎడంపక్కన కొద్దిదూరంలో సఫియా నిలబడి ఉంది. నవ్వుతున్నట్లుండే కళ్లు ఆమెవి. చామన ఛాయలో ఉన్నా.. అందగత్తెలా అనిపిస్తుంది. ఆమె చంకలో ఏడాదిలోపు పిల్లాడు.

''వొస్తున్నరు.. వొస్తున్నరు'' అన్నారెవరో.

కుర్తా – పైజామాలు వేసుకున్న ఇద్దరు, ప్యాంటూ – షర్టుల్లో ఉన్న మరికొందరు చెట్టుకిందికి వచ్చారు. అందరూ లేచి నిలబడి నమస్కరించారు. అక్కడ వేసి ఉన్న ప్లాస్టిక్ కుర్చీల్లో నలుగురు కూర్చున్నాక.. మిగతా వాళ్లంతా సిమెంట్‌బెంచీల మీదా, అక్కడున్న రాళ్లమీదా సర్దుకుని కూర్చున్నారు.

''ఏందసలుకు పంచాయితీ?''.. తెల్లగడ్డం, నల్లటోపీ ఉన్నాయన అడిగాడు.

''గది మాట్లాడనీకే వొస్తిమి. ఎవరు ముందుగాల జెప్తరు?'' అడిగాడు ఇంకో పెద్దమనిషి.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

''ఏందమ్మా మాట్లాడ్త లేరు? రసూల్‌బీ.. నువ్వేచెప్పు. పెద్దదానివి. మీదికెల్లి పంచాయితీ కూడా నువ్వే పెట్టిచ్చినవ్ గద!'' అన్నాడు ఇంకొకాయన.

''ఎవలు పెట్టిస్తె ఏమున్నది భాయి! మా ఇంట్ల పరిస్థితి మంచి గలేదు. నా కొడుక్కు ధోకా అయింది. గందుకనే మాట్లాడేతందుకు పెట్టిచ్చిన'' అన్నది రసూల్‌బీ స్థిరంగా.

''ముందుగాలకెల్లి ఏమైందో చెప్పు! అందరికి సమజ్ అయితది'' అని యాకూబ్ అన్నాడు.

రసూల్‌బీకి అన్న వరుస అవుతాడు.

''ఏంలేదు భాయి! చిన్నప్పటికెల్లి ఎన్ని బాధలుబడ్డనో.. ఎంత తక్లీఫులు జూసిన్నో నాకే ఎరుక! మా అమ్మీకింద ఎంతపని జేసుకుంట తిప్పలుబడ్డ! గీపోరడు గింత మొల్కె కాన్నుంచి.. వాన్ని జూసు కుంట, వానికోసమే బతికిన! గీపిల్ల అన్నబిడ్డే గదా.. తల్లిలేని పోరి. పనిపాట జేసుకుంట కలిమిడిగ ఉంటదనుకుంటి.. దీనికి మాయరోగం పుట్టింది. నా కొడుకు అందర్ల తెలివిగ బతుకాల్నని కడుపుగట్టుకొని, అప్పుస ప్పుజేసి.. తినితినక ఉండుకుంట.. వాన్ని మా అక్కకొడుకుల సోపతికి మస్కట్ పంపితి. వాడు రెక్కలుముక్కలు జేసుకొని, నెత్తురు శెమటగాంగ పనిజేసి.. పైసలు సంపాయించి పంపుతాంటే.. గీ బద్మాష్ దానికి కావురం బట్టి, గా ఆరెంపీ డాక్టర్ గాన్ని పట్టుకున్నది. నా కండ్లు గప్పి వానితోని కులుకుతాంది. గీ పోరడు కూడా వానికి పుట్టినోడే! ఖాందాన్ జెడగొట్టే పోరి మాకొద్దు. మీరే నాయం జెప్పుండి!''.. నిప్పులు కురిపించే కళ్లతో సఫియా వైపు చూస్తూ గబగబా అన్నది రసూల్‌బీ.

సఫియా తల దించుకుని వింటున్నది. అత్త అంటున్న మాటలకు ఆమె ముఖం జేవురించింది. నయీమ్ అభావంగా విన్నాడు.

''ఏం మాట్లాడ్తున్నవ్? మా బెహెన్ మీన ఝూటా మాటలు చెప్తున్నవ్ ఫుప్పూ! మా అక్కను ఏమన్నంటె ఊకునేదిలేదు!'' అంటూ ఆవేశంగా ముందుకొచ్చాడు ఓ యువకుడు. సఫియా తమ్ముడు అన్వర్.

''అరేయ్ అన్వర్! జర రుకో! గుస్సా జేస్తున్నవేంది? నిన్ను అడిగినప్పుడు జెప్పు! అప్పుడిదాక గమ్మున కూసో!'' అన్నాడొకాయన.

''ఇంక ఎవలన్న వచ్చేటిదుందా?'' అడిగాడు పెద్దమనిషి.

అప్పుడే మోపెడ్ మీద అక్కడికి వచ్చాడు ఒకతను.

''ఏమైందిరా.. వొస్తున్నడా?''.. అతణ్ని అడిగాడు పెద్దమనిషి.

''అహ! రానన్నడు''.

''వాడెందుకొస్తడు? చేసేది చేసిండు! గిప్పుడు ఇంట్ల పండుకొని రానంటాండు'' అక్కసుగా అన్నది రసూల్‌బీ.

''నువ్వుండమ్మా! నడిమిట్ల మాట్లాడకు! సదానందం ఏమన్నడురా యూసఫ్?'' అనడిగాడు పెద్దమనిషి.

యూసఫ్ ఏమీ మాట్లాడలేదు.

''ఫర్వా నై! ఏమన్నడో చెప్పు!'' అన్నాడాయన.

యూసఫ్ నోరువిప్పాడు.

''ఆయినెసుత కొంచెం గరం మీదనే ఉన్నడు. 'మా కులపెద్దల పర్మిషన్ లేకుండ నేనెందుకొస్త? మా కులంల పంచాయితీ అయితె ఒస్తగని! నేను ఆ ముసల్దానికి జెర మొచ్చినా, వాళ్లింట్ల ఎవ్వరికి ఒంట్లె బాగలేకపోయినా.. ఎప్పుడు పిలిస్తె అప్పుడొచ్చి, మందులిచ్చి వైద్యం జేస్తె.. నామీద పుండాకోర్ మాటలు మాట్లాడి బద్నాం జేస్తదా? నా శెల్లె అసుమంటి పిల్లతోని నాకు సమ్మందం అంటగడ్తదా? దానిసంగతి జూస్త! ఒదిలిపెడ్తనా!?' అన్నడు'' అని చెప్పిండు యూసఫ్.

సఫియా అత్త ముఖంవైపు చూసింది. ఆమె కళ్లల్లో ఎర్రజీరలు కనిపించాయి.

''నువ్వేం జెప్తవో చెప్పు నయీమ్'' అన్నాడు పెద్ద మనిషి.. సంభాషణను మారుస్తూ.

